వన్నె తక్కువైనా వంశమెరిగింది పెళ్ళాం. ఆడబిడ్డయినా అదరి పడినట్లు మెసలుతోంది. సంసారం జానడైనా ఖర్చు మాత్రం బారెడు కాకుండా చూస్తోంది.

సమయానికి ఏదీ దొరక్కపోయినా అతడు అప్పులు మెప్పులూ యిచ్చే పరపతి జోలికి పోకుండా చేస్తోంది.

అతను పేదవాని స్నేహం వదలక పోడానికీ పెద్దవానితో విరోధం తెచ్చుకోక పోవడానికి కారణం ఆమే. అందుకే ఈ రెక్కాడితే గానీ డొక్కాడని జీవితంలో యిలా అదృష్టమంతా పెళ్ళామేనని సంతుష్టితో బతుకుతున్నప్పుడు ఒకనాడు యెదురు చూడని అదృష్టం అకస్మాత్తుగా రాంబాబును ఆవరించింది. దూరపు చుట్టం ఒకరు సంపాదించి, తన వారెవరూ లేరని, రాంబాబును అదంతా అనుభవించమని వీలునామా రాసి పోయాడు. ఈ సంపద దొరికిందనగానే ఆపదల్లో అరచిన అరవులన్నీ మరచి పోయాడు. ఇందులో వంతుకు గెంతేసి కోర్టుకి లాక్కెళ్ళేవారెవరూ లేరు. అంచేత యెంతో సులువుగా డబ్బు చేతికొచ్చింది.

ఈ డబ్బేం చెయ్యటం? ఇంతవరకూ బతకడానికి తిన్నారు. ఒళ్ళు కప్పుకోడానికి బట్టలు కట్టారు. కానీ వుండడానికి నానా తిప్పలు పడ్డారు. అద్దెయిళ్ళల్లో యెలాగునైనా తలదాచుకుని సర్దుకుందామన్నా యేదో ఒక బాధ. దొడ్డి వుంటే నీరు లేదు. నీరు వుంటే దొడ్డిలేదు. పదుల్లో అద్దెకుండే తాహతు కదా, వందలిచ్చి పెద్ద యిల్లెక్కడ అద్దెకు తీసుకోగలరు? నెల నెలా పెరుగుతున్న అద్దెలే నిజానికి ఈ కుటుంబానికి ఆపద అరువులై పోయాయి.

ఈ డబ్బుతో తలదాచుకోడానికి ఒక యిల్లు కట్టుకోవాలని రాంబాబు నిర్ధారించాడు. అయితే పట్నంలో జాగా దొరకటం అంత సులువా? దొరికినా ఆ జాగా ధరతో ఒక యిల్లే కట్టేవచ్చు. అందుకే విసిగి ఛివరకు పట్నం బయట నాలుగు వందల గజాలు జాగా కాస్త చౌకగా కొన్నాడు.

ఆ జాగా చూసినప్పుడు అక్కడక్కడా పుట్టలూ, చెట్లూ, పుట్టలూ, ఉడతలూ దగ్గరగా వున్న పొలాల గట్లపై యెలికలూ చూసాడు. తను త్రోవతీస్తే తన వెంట యెందరో వస్తారని యిలా సాహసించాడు. ఆర్నెల్లు చూసినా యెవరూ తన చుట్టుపట్ల జాగాలు తీసుకోక పోగానే, తన జాగాలో యీశాన్య దిక్కున ఒక నుయ్యి తవ్వించాడు. పదిహేను అడుగుల్లోనే తియ్యని నీరు పడింది. ఈ వార్తతో మరో ఐదుగురు తన చుట్టుపట్ల జాగాలు తీసుకున్నారు. ఎప్పుడైనా దానికి విలువ రాదా అని కొన్నారు కానీ యిల్లు కట్టేద్దామని కాదు. తను యిల్లు కట్టితే మిగతా వాళ్ళకు వేడి పుడ్తుందని యిల్లు కట్టే ప్రయత్నంలో, పునాదులు తియ్యకుండానే అలసి పోయాడు. ఎన్నో ఆఫీసులు తిరిగాడు. ఎందరికో మొక్కు బడులు చెల్లించాడు. ఒకసారి విసిగి "బాబూ! నేను ఒకరి దగ్గర పుచ్చుకోలేదు కదా" అని ఒకరి దగ్గర గొణిగితే

"కష్టార్జితంతో యిల్లు కట్టేస్తున్నావా? నేను నమ్మను" అనేసి పుచ్చుకోవలసిన మామ్మూళ్ళు పుచ్చుకున్నాడు.

లారీతో పోయించిన యిసుకలోనే యింత కల్తీ వుంటే మరి సిమ్మెంటులో యెంత వుంటుందో?

బతిమాలినా అడిగినంత కూలి యిచ్చినా పనివాళ్ళ దర్జా పని వాళ్ళది. మనిషి యింకో మనిషిపై చేసే నిర్దాక్షిణ్యమైన విలువ దోపిడీని యెదిరించే ధైర్యం లేక గత్యంతరం లేక తల ఒగ్గి యెలాగో యిల్లు నిలబెట్టుకు



మినీ కథ

# అదృష్ట చిహ్నం

బలివాడ కాంతారావు

న్నాడు. ఇంట్లో దిగే సరికి రాంబాబు తను యెన్నడూ చెయ్యననుకున్న పనులు చెయ్యటంతో మానసికంగా నూసిపోయాడు. ఆర్థికంగా అలసి పోయాడు. ఆరోగ్యం పాడుచేసుకున్నాడు.

ఇంట్లో దిగాక మాత్రం అద్దె యింట్లో హీనం పోయి, స్వంత యింట్లో మానంతో బతుకుతున్నామన్న హాయి వచ్చింది. బంధువులతో పాటు యింటికి యెలకల రాకపోకలు కూడా ఆరంభమైనాయి. చుట్టాలు తిని పోయినట్లు యివీ పోతాయనుకుంటే రాత్రుళ్ళు నిద్రను భంగం చెయ్యటం మొదలు పెట్టాయి. ఇక విసిగి లాభం లేదని ఒక పిల్లిని పెంచాడు. ఆ పిల్లి యెలకలను పట్టేకన్నా పిల్లలను పెట్టే పది చోట్లకు తిప్పటం మొదలు పెట్టింది.

ఎలకల బాధతోపాటు యిప్పుడు పిల్లుల బాధకూడా తట్టుకోవలసి వస్తోంది. ఒక్కరోజునే రెండు అనర్థాలు. పెట్టెలో దూరి యెలకలు బట్టలు కొట్టేసాయి. పిల్లులు శేరు పాలు తాగేసాయి. రాంబాబు తొలిసారి జీవహింస చేశాడు. ఆ రాత్రి యించు మించు వేటాడి పడక గదిలో ఒక ఎలకను చంపాడు. ఐనా ఆ మరుసటి రోజు రాత్రి యెలకల బాధ హెచ్చిందిగానీ తగ్గలేదు. రాను రాను 'ప్లేగు' వస్తుందేమో నన్న భయం రాగానే, దొంగల

ముతాల్లా దాడి చేస్తున్న యీయెలుకల మీద బ్రహ్మాస్త్రం వేశాడు. ఎలికల మందు తిని యెలుకలతో పాటు పిల్లి కూడా చచ్చింది.

బొద్దింకలు మందలుగా దాడి చేస్తుంటే యింటి బయట పామును చూశాడు. వీటన్నిటితో పోరాడట్వానికి తనో వీరుడు కావలసి వచ్చింది. ఇప్పటి రాంబాబులో ఒక నాటి విశ్వాసం "అహింసా పరమోధర్మః" పూర్తిగా పోయింది. సహనం చచ్చింది. దయాదాక్షిణ్యాలు కరడు కట్టుకు పోయాయి. తన అదృష్టాన్ని భక్షించే దొంగలు లావయ్యారన్న అనుమానం. ఇల్లు కట్టేటప్పుడు మనుషులు దోచుక తిన్నారు. ఇల్లు కట్టాక జంతువులు దోచుకు తింటున్నాయి. మనుషులనేమీ చెయ్యలేక పోయానన్న అక్కసు, యీ తేళ్ళా, జెర్రులూ, బొద్దింకలూ, యెలకలూ, పాముల మీద తీర్చుకుంటున్నాడు. చంపేతత్వం యెదుర్కొనే తత్వం ప్రబలి పోయింది. ఒకనాడు తన అదృష్టమని నమ్మిన భార్య మీదే ఒకోసారి విసవిసలాడిపోతున్నాడు. నిత్యం మనసులో మెసలుతున్న భయమే ఒక నాటి రాత్రి యింట్లో పడ్డ దొంగతో పోరాటానికి దింపింది. ఈ పోరాటంలో యిద్దరికీ దెబ్బలు తగిలాయి. దొంగకు కాలు విరిగి పోయింది. రాంబాబుకు చేతి మీద, తల మీద దెబ్బలు తగిలాయి. ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. ఒకే వార్డు. దొంగ విరిగిన కాలు తీయవలసిన పరిస్థితి రావచ్చు. రాంబాబును చూడడానికి చుట్టాలు, మిత్రులూ వస్తున్నారు. దొంగ దగ్గర యెవ్వరూ లేరు. వాడో నల్లిలా, బొద్దింకలా, యెలకలానే రాంబాబుకు కనిపించాడు. తన దగ్గరకు వచ్చిన వాళ్ళంతా యిక్కడి నుంచే వాడి వేపు చూసి "దొంగ వెధవ. ఎన్ని దొంగతనాలు చేసాడో? పాపం పండింది. అందుకే కాలు విరిగింది"

ఇలా వాడిని దూషించి రాంబాబు ధైర్యానికి మెచ్చుకొంటున్నారు. రాత్రి.. వార్డు మూగబోయింది. రాంబాబుకు అర్ధ రాత్రయినా నిద్దర రాలేదు. కాసేపట్లో చిన్న మూలుగు వినిపిస్తోంది. బహుశః మత్తు నించి బయట పడ్డాడేమో ఆ దొంగ. వాడే మూలుగుతున్నాడని రాంబాబు పోల్చుకున్నాడు. ఏదో మాటాడుకుంటున్నాడు. వాడికీ యే వూర్లోనో పెళ్ళాం, పిల్లలూ వుండి వుంటారు. వాడి చేతిలోనే ఒక కత్తి వుంటే తను చచ్చేవాడే. ఒక రివాల్వర్ వుంటే తను అంత సాహసించేసి క్రరతో వాడి కాలు విరగ్గొట్టేవాడా? అందుకే ఆ దొంగను యెలకను వేటాడినట్లు వేటాడేడా?

ఇంకా మూలుగు వినిపిస్తుందే గానీ సద్దు రాలేదు. రాంబాబు నడిచే పరిస్థితిలో వున్నాడు. దాహమో ఆకలో? మెల్లగా లేచాడు. దొంగ పడున్న బెడ్ దగ్గరకు వెళ్ళాడు.

"ఏం కావాలి?"

"దాహం ...దాహం"

అక్కడ మంచినీరు లేవు. తన దగ్గర మున్న సీసాలోని మంచినీరు తీసుకువెళ్ళి వాడినోటిలో పోసాడు. తాగాక

"ఎవరు?"

"ఏం యింట్లో దూరావో ఆ యింటి..."

ఆ మసక వెలుగులో కళ్ళు బాగా తెరచి చూసాడు దొంగ.

"తినడానికి వుంటే నీ యింటి మీదెందుకు పడతాను? ఇద్దరం బతికి పోయాం... అంతే చాలు"

ఈ మాటలు తన యింట్లోనికి వచ్చిన ప్రతి ప్రాణీ అన్నట్లు అనిపించింది. మెల్లగా రాంబాబు తన బెడ్ మీదకు తిరిగి వచ్చాడు. ఆ క్షణంలో మళ్ళీ తను యిది వరకటి రాంబాబుగా మారాననుకున్నాడు. భయం లేదు. కోపం లేదు, అసూయ లేదు. చిరాకు లేదు. ఈ మనసుతో ఆలోచిస్తే.

"మనిషి దోచుకుంటాడు లేక దోపిడికి గురి అవుతాడు. దోచుకున్న సంపద అది. దానితో యిల్లు కట్టి అందులో దోపిడీకి గురి అయ్యాను. సుఖాన్ని పోగొట్టుకున్నాను"

పాత రోజులు, పాత అదృష్ట చిహ్నం జ్ఞప్తికి వచ్చి యెంత వేగిరం తెల్లారుతుందా యెంత వేగిరం భార్యకు క్షమాపణ చెప్పుకుందామా అని యెదురు చూశాడు. ●

వివరికీ....

కీమురాయి సైతం
వేకువ కోసం
రేయంతా
రాగాలు
తీసె!

— రేణు


కీళ్ళ పట్లు తనని
కట్టి పడేయడం దేనికి?

# నయం చేసే శక్తి మీ చేతుల్లోనే ఉంది.

మీ చేతుల వెచ్చని సౌమ్యమైన స్పర్శ, అయొడెక్స్‌లో గల నయం చేసే శక్తి— ఇవే తనకి కావలసినవి. అందుకే అయొడెక్స్‌ను అందుబాటులో ఉంచుకోండి. ఎందుకంటే అయొడెక్స్‌లో గాయపడిన ధాతువులను నయంచేసే అయొడిన్, నొప్పిని తగ్గించే మిథైల్ శాలిసిలేట్ చేరి ఉన్నాయి.

**అయొడెక్స్ రోజుకు రెండుసార్లు రెండింతలు గుణకారి.**

నొప్పి తగ్గేవరకూ, ఆ తర్వాత రెండు రోజుల వరకూనూ రోజుకు రెండుసార్లు అయొడెక్స్ వాడమని సిఫారసు చేస్తున్నారు డాక్టర్లు. ఎందుకంటే, నొప్పి ఒక లక్షణం మాత్రమే కాగా అసలు సమస్య లోపలి ధాతువుకైన గాయం.

కనుక మీ ఆప్తులు ఎవరైనా కీళ్ల పట్లు బెణుకులు, కండరాల పట్లు, ఒళ్లు నొప్పులతో బాధపడటం జరిగితే కాస్త అయొడెక్స్ మర్దించండి. రోజుకు రెండుసార్లు. తమని రెండింతలు శీఘ్రంగా మళ్లీ చురుకుగా చేసినందుకు వారు మీకు ఋణపడి ఉంటారు.




అయొడెక్స్®
నయం చేసే శక్తిగల నమ్మకమైన బామ్.

ELL-1510

SKOF – ఎస్‌కేఎఫ్ ఉత్పాదన.